అనంతపురం
శ్రీ సత్యసాయి
గురువారం 9 మే 2024

జన కేతనం



ఆంధ్రజ్యోతి

పోలింగ్ రోజు మాక్ పోల్



అనంతపురం అర్బన్: పోలింగ్ రోజున అసలైన పోలింగ్ ప్రారంభం కావడానికి 90 నిమిషాల ముందు మాక్ పోల్ నిర్వహిస్తారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో 50 ఓట్లను వేయడం ద్వారా నోటాతో సహా పోటీలోని ప్రతి అభ్యర్థికి నమోదైన ఓట్లను నిర్ధారిస్తారు. కంట్రోల్ యూనిట్ ఎలక్ట్రానిక్ ఫలితాలు, వీవీ ప్యాట్ స్లిప్‌ల కౌంట్‌ను ఏజెంట్ల సమక్షంలోనే లెక్కించి చూపిస్తారు. మాక్ పోలింగ్ విజయవంతంగా నిర్వహించినట్లు సర్టిఫికెట్‌ను ప్రిసైడింగ్ ఆఫీసర్ రిపోర్టులో పొందుపరుస్తారు. మాక్ పోల్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఆ డేటాను క్లియర్ చేసేందుకు కంట్రోల్ యూనిట్(సీయు)లోని క్లియర్ బటన్‌ను నొక్కుతారు. మాక్ పోల్ ఓట్లను తొలగించిన తర్వాత సీయూలో ఓట్లు నమోదు కాలేదన్న విషయాన్ని అక్కడి పోలింగ్ ఏజెంట్లకు ప్రదర్శించి చూపుతారు. ప్రిసైడింగ్ అధికారి అన్ని మాక్ పోల్ స్లిప్‌లను వీవీ ప్యాట్ స్లిప్ కంపార్టుమెంట్ నుంచి బయటకు తీసి వాటిని మాక్ పోల్ స్లిప్ అని స్టాంప్ వేస్తారు. అసలైన పోలింగ్ ప్రారంభానికి ముందు ప్రత్యేకంగా సీలు వేసిన నలుపు కవర్‌లో మాక్ పోల్ స్లిప్‌లను ఉంచి పోలింగ్ ఏజెంట్లకు చూపుతారు. మాక్ పోల్ తర్వాత పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లకు సీలు వేస్తారు. అసలు పోల్ ప్రారంభించే ముందు సీళ్లపై పోలింగ్ ఏజెంట్ల సంతకం తీసుకుంటారు.

మా ఓటు మాటేమిటి సార్..?

ఎన్నికల విధుల్లో వీడియోగ్రాఫర్లు



ముదిగుబ్బ: ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ నేతలపై ఎన్నికల సంఘం నిఘా వేసింది. అధికారులు వీడియోగ్రాఫర్లతో ఎన్నికల ప్రచార శైలిపై వీడియోలు తీయిస్తున్నారు. ఎన్నికల అధికారుల వెంట ఉండే వీడియోగ్రాఫర్లు ఓటు హక్కు వియోగించుకొనే అవకాశం ఉందా..? నియోజకవర్గానికి పలువురు వీడియోగ్రాఫర్లను ఎన్నికల అధికారులు పనిలో ఉంచుకున్నారు. వారంతా ఓటు హక్కు వదులుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఎన్నికల కమిషన్ ఈసారి జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు అవకాశం కల్పించింది. తమకు కూడా ఆ కోటాలో పోస్టల్ బ్యాలెట్ వేసుకోవచ్చు కదా అని ఆశించారు. ఐడీ కార్డులు జారీ చేయకపోవడంతో ఈసారి కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నామని వీడియోగ్రాఫర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని, ఊదరగొట్టే అధికారులు తమ వెంట ఉండే సిబ్బంది, పనిలో ఉన్నవారందరితో ఓటు వేయిస్తారో... లేదో ?

లాగేసి.. దోచేస్తున్నారు..!




ఈ చిత్రంలో కనిపిస్తున్న వాటర్ ప్లాంట్ అనంతపురం రూరల్ మండలం ఆలమూరు గ్రామంలోనిది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. బిందె రూ.2లతో సురక్షిత మంచినీటి సరఫరా చేస్తూ గ్రామస్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చాక స్థానిక వైసీపీ నాయకులు ప్లాంట్ లాగేసుకున్నారు. రంగులు, బొమ్మలు మార్చేశారు. బిందె రూ.5తో విక్రయిస్తూ గ్రామస్థుల సొమ్మును దోచేస్తున్నారు. ఈ విధంగా నియోజకవర్గంలో ఇలాంటి వాటర్ ప్లాంట్లు చాలానే ఉన్నాయి. వీటి కోసం మొదట్లో వైసీపీ నాయకులు నానా రాద్ధాంతం చేసి లాగేసుకున్నారంటే అతిశయోక్తి కాదు.

- అనంతపురంరూరల్

వైసీపీ పాలనలో... ఉద్యోగాలు నిల్..!

జాబ్ క్యాలెండర్‌పై సీఎం మోసం

ఏటా పెరుగుతున్న నిరుద్యోగులు



- నిరుద్యోగులుగా డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు
- జగన్ హామీ ఇచ్చి.. మాట తప్పారంటూ మండిపడుతున్న నిరుద్యోగులు

అనంతపురం సెంట్రల్: ప్రతి ఏటా జనవరికి జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేస్తామని గత ఎన్నికల్లో హామీనిచ్చి గద్దెనెక్కిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో ఒక్క జాబ్ క్యాలెండర్‌నూ విడుదల చేయలేదు. ముఖ్యమంత్రి పదవి కోసం ఆయన.. తమను మోసం చేశాడని నిరుద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి. అమ్మా.. అక్కా.. మీపిల్లలకు ఉద్యోగమిస్తా ఒక్కసారి అవకాశం ఇవ్వండి అంటే నమ్మి ఓట్లేశామని, అందుకు తమకు తగిన శాస్తి చేశారని నిరుద్యోగుల తల్లిదండ్రులు వాపోతున్నారు. లక్షలాది రూపాయలు పోసి డిగ్రీలు, పీజీలు, పీహెచ్‌డీలు చదివించిన పిల్లలు ఉద్యోగాల్లేక ఇంటివద్ద ఖాళీగా ఉంటే ఆ బాధ వర్ణనాతీతంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలు లేక, ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు రాక తమ పిల్లలు మానసికంగా కృంగిపోతున్నారని వాపోతున్నారు. ఎస్కేయూ, జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో విద్యను పూర్తిచేసి ప్రతియేటా వేలాదిమంది విద్యార్థులు పట్టాలు పుచ్చుకుని సమాజంలోకి అడుగుపెడుతున్నారు. అయితే వారిలో పట్టుమని పదిశాతం మందికికూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడం లేదు. 2020-23వరకు నాలుగేళ్లలో దాదాపు 2,38,636మంది విద్యార్థులు ఉద్యోగ, ఉపాధిలేక నిరుద్యోగులుగా మిగిలిపోయారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం మాత్రం ప్రతి విద్యార్థి ఉన్నతశిఖరాలను అధిరోహించాలని చిలకపలుకులు పలుకుతోందని నిరుద్యోగులు మండిపడుతున్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయకపోతే నిరుద్యోగాన్ని రూపుమాపడం ఎలా సాధ్యమౌతుందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. యువత మేలుకుని ఉద్యోగాలిచ్చే ప్రభుత్వాన్ని ఓటుతో ఎన్నుకోకపోతే భవిష్యత్తు అంధకారమౌతుందని హెచ్చరిస్తున్నారు.

పెరుగుతున్న నిరుద్యోగం

వైసీపీ ప్రభుత్వ ఏర్పాటు అనంతరం నిరుద్యోగ శాతం ప్రతి ఏడాదీ పెరుగుతూ పోతోందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. 2020వ సంవత్సరంలో 46,990 మంది, 2021లో 53,149 మంది, 2022లో 64,868 మంది, 2023లో 73629 మంది ఇలా ప్రతి సంవత్సరం నిరుద్యోగుల సంఖ్య పెరుగుతోందని, ఈ పరిణామం భవిష్యత్తుకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేకుంటే మానసిక రుగ్మతులకు లోనై ఇతర మార్గాలవైపు వెళ్లేందుకు అలవాటుపడుతారని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా దేశంలోనే అత్యధిక యువత కల్గిన రాయలసీమ నిరుద్యోగ సీమగా మారుతుందని పేర్కొంటున్నారు.

మారుస్తానని మాడ్చేశాడు..

అమ్మా.. అక్కా.. మీ బిడ్డలను నేనే చదివిస్తా.. ఉద్యోగాలు సైతం ఇప్పించి ప్రయోజకులుగా మారుస్తానని జగన్ అమాయక మొహం వేసుకుని చెప్పారని, సరే ఒకసారి చూద్దామని నమ్మి ఓట్లు వేసినందుకు మాకు జీవితాలే లేకుండా చేశారని నిరుద్యోగ విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. వేలకు వేలు చెల్లించి చదివించినందుకు చదువుల పట్టాలు మాత్రమే వచ్చాయని, ఉద్యోగాలు రాలేదని వాపోతున్నారు. మరోసారి వైసీపీ ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే ఇంటిల్లిపాది రోడ్డున పడాల్సిందేనని పేర్కొంటున్నారు. జగన్‌ను గద్దె దించకపోతే యవతకు భవిష్యత్తు ఉండదని హెచ్చరిస్తున్నారు.

పరిశ్రమలే ఏకైక మార్గం..

నిరుద్యోగాన్ని రూపుమాపే ఏకైక మార్గం పరిశ్రమలేనని, వాటిని తీసుకొచ్చే ఆలోచన, సత్తా జగన్‌కు లేదని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తిచేసిన విద్యార్థుల కోసం ఈ ఐదేళ్లలో ఏఒక్క పరిశ్రమనైనా రాష్ట్రానికి తీసుకొచ్చిన పాపాన పోలేదని మండిపడుతున్నారు. జిల్లాకు ఒకకొత్త పరిశ్రమను స్థాపించివుంటే నిరుద్యోగశాతం గణనీయంగా తగ్గేదని చెబుతున్నారు.

పట్టాలు అందుకుని ఉద్యోగాల్లేని విద్యార్థుల వివరాలు..

కోర్సు	2019-20	2020-21	2021-22	2022-23	మొత్తం
డిగ్రీ	13,738	15,187	18,975	21,686	69,586
బీటెక్	24,653	27,911	33,942	38,577	12,5083
బీఫార్మసీ	2,431	2,753	32,49	3,584	12,017
పీజీ	3,962	4,637	5,753	6,368	20,720
పీహెచ్‌డీ	332	321	243	226	1,122
పాలిటెక్నిక్	1,980	2,418	2,628	3,082	10,107
మొత్తం	46,990	53,149	64,868	73,629	23,8636

మెగా డీఎస్సీ విడుదల చేయాలి..



ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయ ఖాళీలన్నీ భర్తీ చేసేలా మెగా డీఎస్సీని విడుదల చేస్తే నాలాంటి వారందరికీ ఉద్యోగాలు లభిస్తాయి. పీజీ, బీఈడీ, టీటీసీ పూర్తిచేసినా ఉద్యోగాల్లేవు. ప్రభుత్వ శాఖల్లో లక్షలాది కొలువులు ఖాళీఉన్నా ప్రభుత్వం వాటిని భర్తీచేయడం లేదు. ప్రతి ఏటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని హామీనిచ్చి చేతులెత్తేశారు. ప్రైవేట్ రంగాల్లోనూ ఉద్యోగాల్లేవు. వచ్చే ప్రభుత్వమైనా సకాలంలో ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలి.

-రంగస్వామి, పీజీ, బీఈడీ, టీటీసీ

ఉపాధి పనులకెళ్లి చదివిస్తున్నారు



మా తలిదండ్రులు ఉపాధి పనులకెళ్లి నన్ను చదివిస్తున్నారు. నాలాగా పీజీ పూర్తిచేసి వేలాది మంది విద్యార్థులు ఏళ్లతరబడి పోటీ పరీక్షలకు సిద్ధమౌతున్నారు. ప్రభుత్వ కొలువు వస్తుందని వందలాదిమంది విద్యార్థులు సొంతూరును వదిలేసి నగరంలోనే అద్దెగదుల్లో ఉంటూ చదువుకుంటున్నారు. అందులో చాలామంది మధ్యాహ్నం గుడిలో ప్రసాదం భుజిస్తూ కష్టపడి చదువుతున్నారు. అందుకు తగిన ప్రతిఫలంగా ఉద్యోగాలకోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి త్వరగా ఖాళీలను భర్తీచేయాలి.

-కొల్లప్ప, పీజీ

ఫలితంలేకుండా పోతోంది..



ఉద్యోగం సాధించాలన్న తపనతో రేయింబవలు కష్టపడి చదువుతున్నా ఫలితం లేకుండా పోతోంది. వేలాది ఉద్యోగాలంటూ ప్రకటనలు చేసి పెండింగ్‌లో పెడుతున్నారు. ఏఒక్క ప్రభుత్వ శాఖలోకూడా పూర్తిస్థాయి ఉద్యోగులు లేరు. ఆయా ఖాళీలన్నీ భర్తీచేస్తే ప్రజలకు మెరుగైన సేవలందడమే కాకుండా ఉద్యోగాలు పొందినవారి కుటుంబాలన్నీ బాగుపడుతాయి.

-రాజకుళ్లాయప్ప, డిగ్రీ

ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేయలేదు

ప్రతి జనవరికి జాబ్‌క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలిస్తామని చెప్పి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం పదవిని పొందారు. అయితే ఐదేళ్లలో ఒక్క జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగులను నడిరోడ్డున పడేశారు. ప్రభుత్వ కొలువులు భర్తీచేయాలని, ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదలచేయాలని ఐదేళ్లుగా నిరసనలు, ర్యాలీలు చేస్తున్నా సీఎంకు చెవికెక్కలేదు. అందుకే ఈ ఎన్నికల్లో నిరుద్యోగులే ఆయన్ను సీఎం పదవిని నుంచి డిస్మిస్ చేయబోతున్నారు.


-టీపీ రామన్న, విద్యార్థి నిరుద్యోగ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

నిరుద్యోగులు పెరిగిపోయారు

ఐదేళ్ల వైసీపీ పాలనలో నిరుద్యోగ శాతం పెరిగిపోయింది. ప్రభుత్వ శాఖల్లో ఒక్క ఖాళీపోస్టుకూడా భర్తీచేయలేదు. అదేవిధంగా పరిశ్రమలు తీసుకువచ్చి ఉపాధి కల్పించే ఆలోచన జగన్‌కు లేదు. రానున్న కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి 36వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తుంది. అదేవిధంగా జిల్లాకొక పరిశ్రమను స్థాపించి ఆయా ప్రాంతాల్లోని విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది.

-లక్ష్మీనారాయణ, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

వైసీపీలో నైరాశ్యం



- ద్వితీయ శ్రేణి నాయకులను పట్టించుకోలేదని ఆవేదన
- పోలింగ్ దగ్గరపడుతున్నా మందకొడిగానే ప్రచారం
- నగదు పంపిణీకి పక్క జిల్లా నాయకులు

హిందూపురం

ఎన్నికల పోలింగ్ దగ్గరపడుతున్నా అధికార పార్టీ ప్రచారం ఇప్పటికీ మందకొడిగానే సాగుతోంది. ఒకవైపు హిందూపురం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ సతీమణి చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం పట్టణంలో ఓటర్లను కలిశారు. మరోవైపు బాలకృష్ణ ఇతర జిల్లాల్లో ప్రచారం చేస్తున్నా నామినేషన్ అనంతరం లేపాక్షి మండలంలో ప్రచారం నిర్వహించారు. పట్టణ, రూరల్ మండలంలో కూడా ఒక విడత ప్రచారం ముగించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇప్పటికీ ఒక మండలం కానీ, పట్టణంలో కానీ ప్రచారం పూర్తి చేసిన దాఖలాలు లేవు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పోలింగ్ దగ్గర పడుతున్నా పరిస్థితి ఇలా ఉంటే ఎలా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఎప్పుడూ ఎన్నికల సమయంలో బీజీగా ఉండే నాయకులు ఇంటికే పరిమితమయ్యారంటే పరిస్థితి అర్థమవుతోంది.

మాట్లాడేవారేరీ..?


ద్వితీయ నాయకులు, కార్యకర్తల్లో మరింత నిరుత్సాహం నెలకొంది. పోలింగ్‌కి తక్కువ గడువు ఉండటంతో ఇప్పటికీ వారిని ముఖ్యనేతలు మాట్లాడకపోవడంతో మదనపడుతున్నారు. తమను ఇప్పటికీ ముఖ్యనేతలు వచ్చి ప్రచారం చేయమని కానీ, ఓటు అడుగమని కానీ చెప్పలేదని, ఇలా అయితే తాము ముందుకు ఎలా వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓటు అడగడానికి వెళితే కొన్ని హామీలు, మరి కొన్ని తాయిలాలు, ఆశలు తీర్చడం సహజం. ముఖ్యనేతలు ద్వితీయ శ్రేణి నాయకులకు ఎలాంటి సూచనలు ఇవ్వకపోవడంతో మాకెందుకులే అన్నట్లు కింద స్థాయి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కండువాలు మారుస్తున్నా చలనం లేదు..

రెండు నెలల క్రితం ఇదే వైసీపీ నాయకులు హిందూపురం నియోజకవర్గంలో టీడీపీ నుంచి భారీ వలసలు ఉంటాయని, ఇక టీడీపీ పని అయిపోయిందని, పెద్దిరెడ్డి స్కెచ్‌లు గీశారంటూ చెప్పుకొచ్చారు. కానీ ఆ పార్టీలోకి వెళ్లిన కథ దేవుడెరుగు కానీ.. అధికార పార్టీ నుంచి ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్‌తో పాటు చిలమత్తూరు జడ్పీటీసీ, పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు టీడీపీకి మారారు. పార్టీ వీడుతున్నా ఆ పార్టీ నాయకుల్లో చలనం కనిపించలేదు. ప్రతిపక్షంతో పోలిస్తే వైసీపీ ఆ దూకుడులో విఫలమైందని అధికార పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు. ఎవరైనా పార్టీ మారతారని తెలిస్తే ముఖ్యులు వారి వద్దకి వెళ్లి తాయిలాలు ఆశ చూపడం, బుజ్జగించడం చేస్తుంటారు. కానీ అలాంటివి ఎక్కడా కనిపించలేదు.

నగదు పంపిణీకి పక్క జిల్లా నాయకులు..?

ఓటర్లకు నగదు పంపిణీ చేసేందుకు పొరుగు జిల్లా నాయకులు వస్తారని స్థానిక నాయకులు చర్చించుకుంటున్నారు. అది కూడా రేపే మాపో ప్రారంభమవుతుందని, స్థానిక నాయకులను నమ్మలేక పక్క జిల్లా నాయకులు వస్తారని చెప్పుకుంటున్నారు. దీని వల్ల స్థానిక నాయకులు గుర్రుగా ఉన్నారు. అసలు ప్రచారమే సరిగా నిర్వహించలేదు, నగదు పంపిణీకి పక్క జిల్లా నాయకులు వస్తారని చెప్పడంతో పుండు మీద కారం చెల్లినట్లు ఉంది. అసలే నియోజకవర్గంలో ప్రచారం తూతూ మంత్రంగా సాగుతుండగా, మరో వైపు నగదు పంపిణీకి ఇతర జిల్లా నాయకులు వస్తున్నారని చెప్పడంతో స్థానిక నాయకులు రగిలిపోతున్నారు. మొత్తానికి హిందూపురం వైసీపీలో నైరాశ్యం నెలకొంది.



స్మార్ట్‌సిటీగా అమ్మవారిపల్లి

కియతో వెలుగులు

పది గ్రామాలకు మహర్దశ.. నాడు రైతు కూలీలు.. నేడు కోటీశ్వరులు

పంటలు సాగుచేయడం.. నష్టాలపాలుకావడం.. అప్పులు చేయడం.. దినదినగండంగా బతకడం.. ఇది ఒకప్పటి పెనుకొండ రైతుల దుస్థితి.. కియ పరిశ్రమ రాకతో ఒక్కసారిగా వారి జీవితాలు మారిపోయాయి. కొత్త వెలుగులు ప్రసరించాయి. భూములకు రెక్కలు వచ్చాయి. వేల రూపాయలు పలికే భూములు కోట్లతో కొనుగోలు చేశారు. కొంత పరిశ్రమలకు పోగా.. మిగిలిన భూముల్లో వాణిజ్య సముదాయాలు నిర్మించి నెలనెలా ఆదాయం పొందుతున్నారు.



అమ్మవారిపల్లిలో వెలసిన భవనాలు

పెనుకొండ రూరల్: ఒకప్పుడు సాగునీరు లేక వ్యవసాయం చేస్తూ పెట్టిన పెట్టుబడులు చేతికందక అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అలాంటి వారి జీవితాల్లో కియ పరిశ్రమ ఏర్పడటంతో కొత్త వెలుగులు చిగురించాయి. కియ కార్లపరిశ్రమ రావడంతో అ మ్మవారిపల్లి, కురుబవాండ్లపల్లి, గుట్టూరు, మునిమడుగు, దుద్దేబండ తదితర పది గ్రామాల కు మహర్దశ వచ్చింది. ఆ గ్రామాలు ఆర్థికం గా అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి. పరిశ్రమ రాకతో యువతకు ఉద్యోగాలు, వ్యాపారపరంగా జీవన విధానం మెరుగుపడింది. చంద్రబాబు కృషి ఫలితంతో కియ పరిశ్రమ వచ్చిందని, ఆయన రుణం తీర్చుకుంటామని రైతులు పేర్కొంటున్నారు.

పెద్ద పెద్ద భవనాల నిర్మాణం

కియ పరిశ్రమ రావడంతో ఐసీఐసీఐ, కెనరాబ్యాంక్, కొటక్ మహీంద్ర, తదితర బ్యాంకులు వెలిశాయి. పరిశ్రమకు రైతులు భూములు ఇవ్వడంతో వచ్చిన పరిహారంతో విలాసవంతమైన భవనాలు వెలిశాయి. ఒక్కో రైతుకు రూ.లక్ష నుంచి రూ.3లక్షల దాకా అద్దెలు వస్తున్నాయి. జాతీయ రహదారి ఆనుకుని ఉండడంతో పరిశ్రమకు అవసరమయ్యే పరికరాలు కంటైనర్ల ద్వారా నిత్యం వేల సంఖ్యలో కియ వద్ద అమ్మవారిపల్లిలో దర్శనమిస్తుండగా ఈ ప్రాంతం స్మార్ట్‌సిటీగా మారిపోయింది.

ఆర్థికంగా ఎదుగుతున్నాం



గతంలో నాకున్న వ్యవసాయ పొలంలో వేరుశనగ సాగుచేసి తీవ్ర నష్టాలపాలయ్యా. పరిశ్రమ కోసం మూడున్నర ఎకరాలు ఇచ్చా. వచ్చిన పరిహారంతో ఇళ్లు నిర్మించుకున్నాం. రూ.40వేలు అద్దె వస్తోంది. ఆర్థికంగా ఎదుగుతున్నాం. చంద్రబాబు రుణం తీర్చుకోలేం.


- రామాంజనేయులు, రైతు, అమ్మవారిపల్లి

చంద్రబాబు రుణం తీర్చుకుంటాం



మాకున్న 13 ఎకరాల్లో గతంలో టమోటా, మిరప, వేరుశనగ పంటలు సాగుచేసి గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పడేవాళ్లం. కియ పరిశ్రమకు 12 ఎకరాలు ఇచ్చాం. మిగిలిన భూమిలో ఇల్లు, భవనం నిర్మించుకున్నాం. నెలనెలా వస్తున్న అద్దెలతో ఆర్థికంగా ఎదుగుతున్నాం. 13న జరిగే ఎన్నికల్లో చంద్రబాబు రుణం తీర్చుకుంటాం.

- వెంకటరెడ్డి, రైతు, అమ్మవారిపల్లి



బాబు చేసిన మేలు మరువలేం




గతంలో వ్యవసాయం చేసి తీవ్రంగా నష్టపోయాం. కియ పరిశ్రమకు ఏడెకరాలు ఇచ్చా. వచ్చిన పరిహారంతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాం. పరిశ్రమ రావడంతో చుట్టుపక్కల పది గ్రామాలు అభివృద్ధి చెందాయి. చంద్రబాబు నాయుడు చేసిన మేలు జీవితంలో మరువలేం.

- భాస్కర్ రెడ్డి, రైతు, అమ్మవారి పల్లి

రూ.19.72 లక్షల నగదు పట్టివేత

బ్రహ్మసముద్రం, మే 8 : మండలంలోని పోలేపల్లి దగ్గర ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ పరశురాముడు తెలిపిన మేరకు.. బ్రహ్మసముద్రం మండలం కపటలింగనపల్లి రోడ్డు పోలేపల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఓ ద్విచక్ర వాహనంలో కర్ణాటక రాష్ట్రం చెళ్లకెర నుంచి రాయదుర్గం పట్టణానికి వెళుతున్న శివ, మంజు అనే ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేసి వారి నుంచి రూ. 19,72,500 స్వాధీనం చేసుకున్నారు. వాటికి సరైన పత్రాలు చూపించకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వీరిద్దరు కూడా అధికార పార్టీకి చెందిన వ్యక్తులు అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అలాగైతే.. ఇలా చేయొచ్చు..!



అనంతపురం టౌన్, మే 8: ఎన్నికల రోజు పోలింగ్‌బూత్‌కు వెళ్లినపుడు అక్కడ మీ ఓటు లేకపోయినా.. ఓటరు జాబితాలో మీపేరు గల్లంతయినా.. మీ ఓటరు కార్డుతోపాటు ఆధార్‌కార్డు చూపించి సెక్షన్ 49 ఏ కింద చాలెంజ్ ఓటు వేయవచ్చు. మీ ఓటు అప్పటికే ఇతరులు వేసేసి వెళ్లినట్టయితే.. ఓటరు ధైర్యంగా టెండర్ ఓటు అడగొచ్చు. ఇలా ఏ బూత్‌లోనైనా 14శాతం దాటి టెండర్ ఓట్లు పోలైతే అక్కడ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రీపోలింగ్ నిర్వహిస్తారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

గోపాలకృష్ణ గోఖలే (జయంతి)



మొహమ్మద్ అలీ జిన్నా, మహాత్మాగాంధీలకు రాజకీయ గురువు గోపాలకృష్ణ గోఖలే 1866 మే 9న మహారాష్ట్ర రాష్ట్రం రత్నగిరి జిల్లా కొత్లుక్ గ్రామంలో జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధుడు, సమాజ సేవకుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు. కళాశాల విద్యను అభ్యసించిన తొలితరం భారతీయుల్లో గోఖలే ప్రము ఖులు. 1884లో ఎఫిన్‌స్టోన్ కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో చదివారు. 1902 - 1915వరకు భారత శాసనమండలి సభ్యుడిగా కొనసాగారు. 1905లో సర్వెంట్స్ ఆఫ్ సొసైటీని ఏర్పాటు చేసి దేశప్రజలలో జాతీయతాభావాన్ని పెంపొందించేందుకు కృషి చేశారు. ఆయన పేరిట 1930లో పూనెలో గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనామిక్స్ విద్యాలయం ఏర్పాటైంది. 1915 ఫిబ్రవరి 19న కన్నుమూశారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ (వర్ధంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత దుర్గాబాయి దేశ్‌ముఖ్ 1909 జూలై 15న తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధురాలు, న్యాయవాది, సంఘసంస్కర్త, రాజ్యాంగ నిర్మాణసభ ఏకైక మహిళా సభ్యురాలు, ప్లానింగ్ కమిషన్ సభ్యురాలు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్‌కు తొలి ఛైర్‌పర్సన్. చెన్నై, హైదరాబాద్‌లలో ఉన్న ఆంధ్ర మహిళాసభలను ఈమె స్థాపించారు. ఈమె భర్త సీడీ దేశ్‌ముఖ్ స్వతంత్ర భారత రిజర్వుబ్యాంకు తొలి గవర్నర్. యునెస్కో అవార్డు, నెహ్రూ లిటరసీ అవార్డు తదితర గౌరవాలు అందుకున్నారు. 1981 మే 9న కన్నుమూశారు. కాగా మహిళా అభ్యున్నతికి పాటుపడే స్వచ్ఛంద సంస్థల కోసం ఆమె పేరిట కేంద్ర సాంఘిక సంక్షేమబోర్డు ఏటా ప్రత్యేక అవార్డు ఇస్తోంది.

విజయ్ దేవరకొండ (పుట్టినరోజు)



దేవరకొండ విజయ్ సాయి 1989 మే 9న హైదరాబాద్‌లో జన్మించారు. నాటకాల్లో బాగా రాణించిన విజయ్ సినిమాల్లోకి ప్రవేశించారు. 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్'లో కూడా చిన్నపాత్ర పోషించారు. 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాలో రిషి పాత్ర, 'పెళ్లి చూపులు' సినిమాలో హీరో పాత్రతో ప్రశంసలు అందుకున్నారు. 'అర్జున్ రెడ్డి'తో బాక్సాఫీస్ రికార్డు పొందారు. మహానటి, 'గీత గోవిందం' తదితర సినిమాలతో యూత్‌లో మంచి ఫాలోయింగ్ కలిగియున్నారు. సొంత ప్రొడక్షన్ కంపెనీ ఏర్పాటు చేసి 'మీకు మాత్రమే చెప్తా' సినిమా తీశారు. 2019లో ఫోర్బ్స్ ఇండియా '30 అండర్ 30' జాబితాలో చోటు దక్కించుకున్నారు.

సాయి పల్లవి (పుట్టినరోజు)



సాయిపల్లవి సెంతామరై 1992 మే 9న తమిళనాడు రాష్ట్రం ఊటీ సమీపంలోని కొత్తగిరి గ్రామంలో జన్మించారు. నటి, నృత్యకారిణి. తెలుగు, తమిళ, మళయాళ సినిమాలలో పేరొందారు. మళయాళంలో 'ప్రేమమ్', తెలుగులో 'ఫిదా' సినిమాతో గుర్తింపు సాధించారు. రెండింటికీ ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు పొందారు. అమెరికాలో వైద్యవిద్యను పూర్తి చేశారు. 2020లో ఫోర్బ్స్ మేగజైన్‌లో ఇండియాలో '30 అండర్ 30' విభాగం జాబితాలో చోటు పొందారు. ఉత్తమ నటి, స్పెషల్ జ్యూరీ సహా ఇతర అవార్డులు కూడా అందుకున్నారు.

గాలికుంటు వ్యాధి ప్రబలకుండా టీకాలు



ఆవుకు టీకా వేస్తున్న వైద్యుడు

శిడ్లఘట్ట, మే 8: పశువులలో గాలికుంటు వ్యాధి ప్రబలకుండా సీజన్‌లవారీగా తగిన రీతిలో టీకాలు వేయించాలని పశువైద్యశాఖ సహాయక డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. సాధారణంగా ఎద్దులు, గేదెలు, పందులలో గాలికుంటు వ్యాధి ఎక్కువగా కనిపిస్తుందన్నారు. పాడి రైతులు సకాలంలో తాము పెంచుతున్న పశువులకు టీకాలు వేయించాలన్నారు. ప్రస్తుతం గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల అభియాన సాగుతోందన్నారు. తాలూకాలో 28,926 పశువులు, 3536 గేదెలు ఉన్నాయని గ్రామాలవారీగా శిబిరాలు నిర్వహిస్తూ టీకాలు వేస్తున్నట్టు తెలిపారు.

లోకాయుక్త వలలో పీడీఓ



పీడీఓ నిరంజన్

దొడ్డబళ్ళాపుర, మే 8: రెస్టారెంట్ లైసెన్స్ రెన్యూవల్ చేసేందుకు రూ.5లక్షలు డిమాండ్ చేసి చివరకు రూ.3.50లక్షలు లంచం తీసుకుంటుండగా అరకుమల్లిగె గ్రామపంచాయతీ పీడీఓ ఎంజీ నిరంజన్ లోకాయుక్త వలలో చిక్కాడు. అరకుమల్లిగె గ్రామపంచాయతీ పరిధిలోని రెస్టారెంట్ నిర్వహిస్తున్న నరసింహామూర్తి లైసెన్స్ రెన్యూవల్‌కోసం పీడీఓ వద్దకు వెళ్లాడు. ఇందుకు రూ.5లక్షల లంచం డిమాండ్ చేశారు. అయితే రూ.3.50 లక్షలకు అంగీకరించారు. ముందస్తుగా బెంగళూరు గ్రామీణ జిల్లా లోకాయుక్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం దొడ్డబళ్ళాపుర తాలూకా పంచాయతీ ఆవరణలోని నరేగా సహాయక డైరెక్టర్ చాంబర్‌లో ఉన్న పీడీఓ నిరంజన్‌కు రూ.3.50లక్షలు ఇస్తుండగా మంగళవారం లోకాయుక్త పోలీసులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు నిరంజన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కార్యాచరణలో లోకాయుక్త ఎస్పీ పవన్ నెజ్జూరు, డీఎస్పీలు టీసీ వెంకటేశ్, గిరీశ్ రోడకర్, చంద్రకాంత్, వెంకటేశ్, నందకుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్వల్ వివాదంలో.. ప్రభుత్వ తీరు సమంజసమే

- దేవరాజేగౌడతో కుమార చర్చలు బహిరంగం చేస్తారా?
- మంత్రుల సవాల్

బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల పెన్‌డ్రైవ్ వివాదంపై ప్రభుత్వ తీరు సమంజసంగా ఉందని మంత్రులు స్పష్టం చేశారు. కృష్ణబైరేగౌడ, రామలింగారెడ్డి, చలువరాయస్వామితోపాటు పలువురు కేపీసీసీలో బుధవారం మీడియాతో మాట్లాడారు. ప్రపంచంలోనే ఇదో అతిపెద్ద సెక్స్ స్కాండల్ అని కృష్ణబైరేగౌడ మండిపడ్డారు. ఇటువంటి వివాదం బహిరంగమైనప్పుడు ప్రభుత్వం వెంటనే పోలీసులను రంగంలోకి దించాల్సిన అవసరం ఉంటుందన్నారు. పెన్‌డ్రైవ్‌కు సంబంధించి న్యాయవాది దేవరాజెగౌడ, కుమారస్వామితో భేటీ అయి ఏ అంశాలు చర్చించారో హాసనాంబ దేవతముందు సవాల్ చేస్తారా..? అని సవాల్ విసిరారు. హిందూ మహిళల మాంగల్యాలను తెంపేసేలాంటి తీవ్రమైన సంఘటన అన్నారు. మహిళల మానాన్ని దోచడమే కాకుండా బెదరిచేలా వీడియోలు చేయడం అంత్యత తీవ్రమైన నేరమన్నారు. పెన్‌డ్రైవ్ వివాదాన్ని మూసివేసేందుకు వ్యవస్థకృతంగా కుట్ర సాగుతోందన్నారు. లైంగిక దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తిని తప్పించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని, ఇది సర్జికల్ స్ట్రైక్ తరహాలో వ్యవస్థీకృత కుట్ర అన్నారు. రేప్ చేయడం ముఖ్యం కాదని, ఎవరినుంచి బయటకు వచ్చిందనేది కీలకంగా మారిందన్నారు. పెన్‌డ్రైవ్ అతడి వద్ద ఉన్నప్పుడు బీజేపీకి ఎందుకు ఇవ్వలేదన్నారు. మహిళల మర్యాద తీసే హక్కు ఎవరికి ఉందన్నారు. హైకోర్టు న్యాయమూర్తికి ఎందుకు ఇవ్వలేదన్నారు. లైంగిక దాడి చేయాలని ఎవరు కోరారని, మేం కోరామా..? అని ప్రశ్నించారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునే విధానం సరికాదన్నారు. కాగా పెన్‌డ్రైవ్ వివాదంలో ముందస్తు బెయిల్ కోసం కారు డ్రైవర్ కార్తీక్, పుట్టరాజు, నవీన్, చేతన్‌లు దాఖలు చేసుకున్న పిటీషన్‌ను హాసన్‌లోని అదనపు జిల్లా సెషన్స్ కోర్టు బుధవారం కొట్టేసింది.



కేపీసీసీలో మీడియా సమావేశంలో మంత్రులు

'ఎకో పార్కు'ను పట్టించుకోండి



పచ్చదనం కరువైన పార్కు ఇలా..

బాగేపల్లి, మే 8: తాలూకాలో రోజురోజుకు ఎండతాపం పెరుగుతుండడంతో నీటి ఎద్దడి నెలకొంది. దీని ప్రభావం ఉద్యానవనాల పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఇక్కడ పార్కులు ఉన్నాయా అనే ప్రశ్న తలెత్తేలా దుస్థితికి చేరుకోవడంపై ప్రజలలో అసంతృప్తి నెలకొంది. పట్టణ శివారులోని జడలబైరవేశ్వరస్వామి దేవాలయ రోడ్డులో సుమారు 3 ఎకరాల ప్రభుత్వ విస్తీర్ణంలో అప్పటి ఎమ్మెల్యే ఎన్ సంపంగి తన గ్రాంట్లతో పిల్లల పార్కును ఎకో పార్క్‌గా తీర్చిదిద్దారు. 30వేల జనాభా కలిగిన బాగేపల్లి పట్టణానికి ఈ పార్కు ప్రతిష్ఠాత్మకంగా ఉండేది. పార్కు నిర్వహణ బాధ్యత బాగేపల్లి పురసభ పర్యవేక్షించేంది. 15ఏళ్లుగా పచ్చదనంతో కళకళలాడిన ఈ పార్కు నిర్వహణను పట్టించుకోకపోవడంతో పాడుబడినట్టుగా మారింది.

కొరవడిన పర్యవేక్షణ

చిన్నారులు ఆటలాడేందుకు పలు ఆకర్షణీయ ఆట పరికరాలు అమర్చారు. ఉద్యానవనం మధ్యలో ఆకర్షణీయంగా ఫౌంటైన్ ఏర్పాటు చేశారు. దీనికి తోడు వాకింగ్ చేసేలా ట్రాక్ ఉండేది. విశ్రాంతి స్థలం కల్పించారు. 3 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఎకో పార్క్‌లో తగిన భద్రతా వ్యవస్థ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గుట్కా ప్యాకెట్ కవర్లు, ఖాళీ మందుబాటిళ్లు కనిపిస్తున్నాయి. ఇక్కడి ఫౌంటైన్ చెత్త దిబ్బగా మారింది. పలు చోట్ల ప్లాస్టిక్ వ్యర్థాలు గోచరిస్తున్నాయి. దీనిపైవ పురసభ మాజీ అధ్యక్షురాలు మమతా నాగరాజరెడ్డి స్పందిస్తూ పట్టణానికి మణిమకుటంలా ఉండే పార్కును నిర్లక్ష్యం చేయడం బాధాకరం. ఇకనైనా పురసభ అధికారులు తగిన చొరవ చూపాల్సిన అవసరం ఉంది. స్వచ్ఛతను కాపాడి పార్కును పునరుద్ధరించాలి. స్థానికుడు వినోద్‌రెడ్డి మాట్లాడుతూ చిత్రావతి నదికి అనుబంధంగా ఉన్న జడల బైరవేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులు, వ్యాహ్యాళికి వచ్చేవారు విశ్రాంతికోసం పార్కుకు రావాలంటే వెను కంజ వేసే పరిస్థితి నెలకొంది. ఎకో పార్క్‌కు సార్థకం చేసేలా కార్యాచరణ అవసరమని అభిప్రాయపడ్డారు.



ఫౌంటైన్ దుస్థితి

చిన్నారుల కోసం ఫన్‌వరల్డ్‌లో కొత్త ఆవిష్కరణలు

బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధి చెందిన ఫన్‌వరల్డ్ అమ్యూజ్‌మెంట్ పార్క్‌లో చిన్నారులు మరింత సరదాగా గడిపేలా సరికొత్త ఆవిష్కరణలు అందుబాటులోకి తెచ్చామని నిర్వాహకులు తెలిపారు. కొన్నేళ్ళుగా నగరంలో అన్నివర్గాల ప్రజలు సరదాగా సంతోషంగా గడిపేలా ఫన్‌వరల్డ్ పనిచేస్తోందని మేనేజర్ ప్రదీప్ అభిప్రాయపడ్డారు. జయమహల్ రోడ్డులోని టీవీ టవర్ సమీపానగల ఫన్‌వరల్డ్‌లో ప్రస్తుతం 29 ఆకర్షణీయమైన వాటర్ స్లైడ్‌లను పరిచయం చేస్తున్నామన్నారు. దేశంలోనే అత్యంత ఎత్తులో రైడ్ చేసేలాంటి విన్యాసం ఆకర్షణీయంగా ఉందని ఇక్కడ మాత్రమే ఈ విన్యాసం సాధ్యమని ప్రకటించారు. దేశంలోనే అతి పెద్ద కరౌసల్‌లో ఏకంగా వందమంది సీట్ల సామర్థ్యం కలిగి ఉండగా అన్నివయస్సుల వారు ఎంజాయ్ చేయవచ్చు అన్నారు. మొత్తంగా 85 రైడ్‌లు యువతను ఆకట్టుకునేలా ఉన్నాయన్నారు. మేం సదా కొత్త ఆవిష్కరణల ద్వారా అన్నివర్గాల ప్రజలు సరదాగా గడిపేందుకు ప్రోత్సహిస్తామన్నారు. ఫన్‌వరల్డ్ ద్వారా సరికొత్త అనుభూతులు ప్రతి సందర్శకుడికి కల్పించాలనేది మా ఆశయమన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సాహసమైన విన్యాసాలాకు అనుగుణమైన యంత్రాలు ఏర్పాటు చేశామన్నారు. సాహస విన్యానాలు, ఆకర్షణీయంతో పాటు ప్రతి సందర్శకుడి రక్షణకు కట్టుబడి వినోదాన్ని పంచుతున్నామన్నారు.



సరికొత్త రైడర్‌లతో సరదాగా ఇలా..

మినీ విధానసౌధలో స్వచ్ఛతా అభియాన

చింతామణి, మే 8: పట్టణంలోని బెంగళూరు డబుల్ రోడ్డులోని మినీ విధానసౌధ ఆవరణలో స్వచ్ఛతా అభియాన నిర్వహించారు. సబ్ రిజిస్ట్రార్ నారాయణప్ప నేతృత్వంలో కార్యాలయ సిబ్బంది, పలువురు స్టాంప్‌వెండర్స్ పాల్గొని స్వచ్ఛ పరిచారు. కార్యాలయ వెనుకభాగంలోనూ, స్టాంప్ వెండర్స్ కూర్చునే ప్రదేశం ఇతరత్రా ప్రదేశాలల్లో చెత్త పేరుకుపోవడంతో సబ్‌రిజిస్ట్రార్ స్పందించారు. బుధవారం ఒక గంటపాటు అందరూ శ్రమదానం చేశారు. మినీ విధానసౌధ ఆవరణలో తహసీల్దార్ కార్యాలయం, సర్వేయర్ శాఖ, సబ్‌రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ తదితర కార్యాలయాలు ఉన్నాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పశ్చిమ, దక్షిణభాగం చుట్టుపక్కల చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్గంధం వస్తోంది. పరిస్థితిని గమనించిన అధికారి వెంటనే స్వచ్ఛతా అభియానకు పిలుపునిచ్చారు. సిబ్బంది, స్టాంప్ వెండర్‌లు పాల్గొని స్వచ్ఛపరిచారు. చెత్తను కుప్పగా చేర్చడంతో నగరసభ సిబ్బంది వచ్చి తొలగించారు. అందరి సహకారంతోనే శ్రమదానం సాధ్యమైందని సబ్‌రిజిస్ట్రార్ నారాయణప్ప తెలిపారు. మొత్తమ్మీద కార్యాలయ అధికారుల చొరవ ప్రశంసలకు పాత్రమైంది.



స్వచ్ఛతా అభియానలో సబ్‌రిజిస్ట్రార్ నారాయణప్ప, స్టాంప్ వెండర్‌లు

రోబోటిక్ సర్జరీ విజయవంతం

బెంగళూరు, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా భయం కలిగించే కేన్సర్ పట్ల అవగాహన ముఖ్యమని అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని అపోలో కేన్సర్ సెంటర్ ముఖ్యులు డాక్టర్ విశ్వనాథ్ ప్రకటించారు. బెస్ట్ అంకాలజీ కన్సల్టెంట్‌గా పేరొంది దేశంలోనే స్థనకేన్సర్‌కు రోబోటిక్ సర్జరీలో శిక్షణ పొందిన డాక్టర్ జయంతి తుమ్మి నేతృత్వంలో తొలి సర్జరీ విజయవంతమైంది. ఈమేరకు జయంతితోపాటు అపోలో కేన్సర్ సెంటర్ ప్రతినిధులు బుధవారం మీడియాతో మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన 28ఏళ్ల మహిళకు బ్రెస్ట్ కేన్సర్ ఉన్నట్టు గుర్తించామని జయంతి తెలిపారు. చిన్నపాటి కోత ద్వారా రోబోటిక్ సర్జరీ చేశామన్నారు. స్థనభాగంలో చర్మాన్ని రక్షించేందుకు వీలుగా ఆపరేషన్ చేశామన్నారు. ఈ ప్రక్రియలో స్థనం పునర్నిర్మాణం సులభతరం కానుందని, కేన్సర్ బాధితులకు అనేక ప్రయోజనాలు కలిగించనుందన్నారు. రొమ్ముకేన్సర్ బాధితులు ఎక్కువగా ఉన్నా మనుగడ సాధించే అవకాశం అధికంగా ఉందని అభిప్రాయపడ్డారు.



మీడియాతో డాక్టర్ జయంతి తుమ్మి, ఇతర వైద్యబృందం తదితరులు

జర్మనీ నుంచి స్టెమ్‌సెల్ దాత

బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): స్టెమ్‌సెల్ దానం ద్వారా ప్రాణదానం చేసిన వ్యక్తి సదరు బాధితుడిని పరామర్శించేందుకు జర్మనీ నుంచి రావడం విశేషం. 17ఏళ్ల చిరాగ్ కొంత కాలంగా తస్లేమియాతో ఇబ్బంది పడుతున్నాడు. బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఇతరత్రా సమస్యలు ఎదుర్కొంటున్నాడు. ఇందుకు తగిన స్టెమ్‌సెల్ దాతకోసం వెతికారు. 2016లో డికెఎంఎస్ డేటాబేస్ ద్వారా జర్మనీ దేశం మున్సింజెన్‌కు చెందిన 29ఏళ్ల రోమన్‌తో మ్యాచ్ అయ్యింది. రోమన్ సానుకూలంగా స్పందించి స్టెమ్‌సెల్ ఇచ్చేందుకు ముందుకు వచ్చాడు. స్టెమ్‌సెల్ దానం చేయడంతో తన జీవితం నిలబడిందని చిరాగ్ పేర్కొన్నారు. ఇటీవల బెంగళూరుకు రోమన్ రావడంతో చిరాగ్ కుటుంబీకులు అతడికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



చిరాగ్‌తో రోమన్ తదితరులు

క్రీడలపట్ల విద్యార్థులు ఆసక్తి చూపాలి



ఈతలో రాణించిన నవీన్‌కు ప్రోత్సాహకం అందజేత

బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలపట్ల విద్యార్థులు ఆసక్తి చూపాలని పీఈఎస్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జే సూర్యప్రసాద్ అభిప్రాయపడ్డారు. పీఈఎస్ యూనివర్సిటీలో క్యాంపస్ చాలెంజ్ క్రీడా పురస్కారాలను ప్రదానం చేసిన సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ చదువుతోపాటు శారీరక శక్తి, మానసిక వికాసం కోసం క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ నితేశ్ కే మాట్లాడుతూ ఇదే కళాశాలలో బీఈ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ పూర్తి చేశానన్నారు. ఆర్థిక వ్యవహారాలపై ఉన్న ఆసక్తితో ఎంపికయ్యానన్నారు. విద్యార్థులు డిగ్రీలో చదివే మూడు నాలుగేళ్ల విద్యాభ్యాసం జీవితంలో 30-40ఏళ్లపాటు వారి జీవితాన్ని నిర్ధారిస్తుందన్నారు. క్రీడల్లో రాణించిన 8మంది సాధకులకు రూ.10వేల చొప్పున నగదు బహుమతిని ప్రదానం చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ కేఎస్ శ్రీధర్, డీన్ వీ కృష్ణ, స్పోర్ట్స్ డైరెక్టర్ వినయ్ ఎంఎస్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్‌చే బెంగళూరులో హౌసింగ్‌లోన్



మీడియాతో సంస్థ ప్రతినిధులు

బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎల్‌అండ్‌టీ రిటైల్ ఫైనాన్సింగ్ సంస్థ బెంగళూరులో హౌసింగ్‌లోన్‌లు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. ఎల్‌టీఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సుదిప్త రాయ్, ఎల్‌టీఎఫ్ అర్బన్ ఫైనాన్స్ సీఈఓ సంజయ్ గరియాలులు బుధవారం మీడియాకు వివరించారు. ఎల్‌అండ్‌టీ సంపూర్ణంగా గృహ రుణాలు అందించదలిచామన్నారు. డిజిటలైజ్డ్ ప్రాసెస్, డెడికేటెడ్ రిలేషన్‌షిప్ మేనేజర్, హోం టేకర్ ఫైనాన్స్‌తో కలిపి 'కం నహి కంప్లీట్' అనే విధానం కింద రుణాలు మంజూరు చేయదలిచామన్నారు. బెంగళూరులో పేరొందిన రియల్ కంపెనీలతో కలసి పని చేయదలిచామన్నారు. నగర వ్యాప్తంగా సొంతింటి కల సాకారం చేసుకోదలిచినవారికి ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ సంపూర్ణంగా రుణం సదుపాయం అందించనుందన్నారు. ఇప్పటివరకు హౌసింగ్‌లోన్ మాత్రమే అన్ని సంస్థలు సాధ్యం చేస్తున్నాయని అయితే ఎల్‌అండ్‌టీ ఇంటీరియర్ డిజైన్, హోం డెకరేట్ విభాగాలకు కూడా రుణాలు అందచేయదలిచిందన్నారు.

శ్యామ్‌పిట్రోడా వ్యాఖ్యలపై విజయేంద్ర ఆగ్రహం

బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్యామ్ పిట్రోడా వ్యాఖ్యలు సమంజసంగా లేవని ఆయన తరచూ దేశంలో వివాదాలు సృష్టించేలా మాట్లాడుతున్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర మండిపడ్డారు. బెంగళూరులో బుధవారం మీడియాతో మాట్లాడుతూ దక్షిణ భారతీయులను ఆఫ్రికన్‌లుగా పోల్చడాన్ని తప్పుబట్టారు. మనుషులు ఇలాగే ఉంటారనే పోలికలు సరికాదన్నారు. శ్యామ్‌పిట్రోడా కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితుడని, ఆయన వ్యాఖ్యలపై పార్టీ స్పందించాలని డిమాండ్ చేశారు. ఇటీవలే పిత్రార్జిత ఆస్తులపై పన్ను వసూలు చేయాలనే వ్యాఖ్యానించారని ఇది దేశవ్యాప్తంగా విమర్శలకు కారణమైందని, మరోసారి అటువంటి వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ విభజన రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు.

రైతుసంఘం అధ్యక్షుడిగా ఆంజినప్ప

శిడ్లఘట్ట, మే 8: రైతుసంఘం, హసిరుసైన్య తాలూకాలోని బశెట్టిహళ్ళి హోబళి స్థాయి అధ్యక్షుడిగా బి ఆంజినప్ప నియమితులయ్యారు. ఈ మేరకు ఆంజినప్ప మాట్లాడుతూ రైతుసంఘం సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తానన్నారు. రైతుల సంక్షేమానికి తనవంతు నిరంతరం శ్రమిస్తానన్నారు. కులమతాలకు అతీతంగా సంఘాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా తాలూకా అధ్యక్షుడు ఎన్ మునేగౌడ, జిల్లా ప్రధాన కార్యదర్శి భక్తరహళ్ళి ప్రాంతీయ రైతు నాయకుడు చింతామణి కజూరప్ప, దొడ్డదేకల్లి కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మెల్ టాపర్‌గా హితేశ్



హితేశ్

బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఐసీఎస్ఈ పదో తరగతి పరీక్షల్లో కార్మెల్ స్కూల్ టాపర్‌గా హితేశ్ నిలిచారు. ఇంగ్లిష్‌లో 96, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 100, హిస్టరీలో 99, సైన్స్‌లో 98, మ్యాథమ్యాటిక్స్‌లో 96, కన్నడలో 92 మార్కులు సాధించి ఏ గ్రేడ్‌తో ఉత్తీర్ణులయ్యారు. ఈమేరకు కార్మెల్ పాఠశాల యాజమాన్యం బుధవారం ప్రత్యేకంగా అభినందించింది.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నారాయణస్వామి


శిడ్లఘట్ట, మే 8: ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్సీ నారాయణ స్వామి భరోసా ఇచ్చారు. ఆగ్నేయ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికల సమీపించడంతో పట్టణం లోని పలు విద్యాసంస్థలలో పర్యటించి ప్రచారం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు మూడుసార్లు గెలుపొందానని, ఈ ప్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలపై అవగాహన ఉందన్నారు. ఒకసారి స్వతంత్ర అభ్యర్థిగా, రెండుసార్లు బీజేపీ తరపున పోటీ చేసి గెలుపొందానన్నారు. ప్రస్తుతం బీజేపీ అధికారిక అభ్యర్థిగా పోటీ చేస్తున్నా అన్నారు. ఈసారి కూడా తనను గెలిపించాలని ఉపాధ్యా యులను కోరారు. ఈ సందర్భంగా డాల్ఫిన్ విద్యాసంస్థ సంస్థాపక అధ్యక్షుడు ఏ నాగరాజ్, రిటైర్డు టీచర్ నాగరాజ రావ్, కెంపణ్ణ, ఉపాధ్యాయులు మేలూరు మురళి, అరళి ప్రకాశ్, అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలిన హోర్డింగ్



కూలిపోయిన హోర్డింగ్

దొమ్మసంద్ర, మే 8: నగరంలో ఈదురుగాలులతో కూడిన వర్షం ప్రభావానికి పలు చోట్ల హోర్డింగ్‌లు కూలాయి. మంగళవారం రాత్రి వర్తూరు రోడ్డులోని భారీ హోర్డింగ్ నేలకూలింది. వీరభద్రేశ్వర హోటల్‌కు అనుబంధంగా హోర్డింగ్ ఏర్పాటు చేయగా కుప్పకూలింది. ప్రమాదంలో షెడ్‌లాంటి హోటల్ పూర్తిగా దెబ్బతింది. అలాగే పక్కనే ఉన్న ప్లై వుడ్ గోడౌన్ కమ్మీల గోడౌన్, భవనానికి నష్టం వాటిల్లింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. ఈదురుగాలుల ధాటికి కొన్ని చోట్ల చిన్నా చితకా బోర్డులు ఎగిరి రోడ్డుపైకి పడినట్టు తెలుస్తోంది. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోక ముందే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.74	1,575.72
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	828
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	138	107
సామర్థ్యం (టీఎంసీలు)	3.47	2.73

సిరుగుప్పలో 71.18 శాతం పోలింగ్

సిరుగుప్ప, మే 8 : సిరుగుప్ప తాలుకాలో 71.18 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారి తిరుమలేష్ తెలిపారు. తాలుకా పరిధిలో అన్ని చోట్ల ప్రశాంతంగా పోలింగ్ జరిగిందని, ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగలేదన్నారు. ఈవీఎంలను కొప్పాళ జిల్లా హెడ్ క్వార్టర్‌కు తరలించినట్లు తెలిపారు. పోలింగ్ సందర్భంగా ఓటు వేసిన యువతీయువకులు తమ హక్కులను సాధించుకున్నామని ధీమా వ్యక్తం చేశారు.

భారీగా నగదు పట్టివేత

బ్రహ్మసముద్రం, మే 8: భారీగా నగదును బ్రహ్మసముద్రం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ పరశురాముడు తెలిపిన వివరాల మేరకు ఇలా వున్నాయి. బ్రహ్మసముద్రం మండలం కపటలింగనపల్లి రోడ్డు పోలేపల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో ఓ ద్విచక్ర వాహనంలో కర్ణాటక రాష్ట్రంలో చెళ్లకెర నుండి రాయదుర్గం పట్టణానికి వెళుతున్నా శివ, మంజు అనే ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా వారి నుండి రూ. 19,72,500లు స్వాధీనం చేసుకున్నారు. వాటికి సరైన పత్రాలు చూపించకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. అయితే వీరిద్దరు కూడా అధికార పార్టీకి చెందిన వ్యక్తులు అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఉజ్జినిని దర్శించుకున్న శ్రీశైల జగద్గురు



ధార్మిక కార్యక్రమంలో పాల్గొన్న శ్రీశైల జగద్గురు

కంప్లి, మే 8: శ్రీశైలం జగద్గురు చిన్న సిద్దరామ పండితారాధ్య శివాచార్యులు బుధవారం విజయనగర జిల్లా కొట్టూరు తాలుకాలో వున్న ఉజ్జిని పీఠాన్ని దర్శించారు.. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ మనుషులు ధర్మాన్ని కాపాడితే కష్టకాలంలో మనిషికి అందవలసిన అన్ని వసతులు అందుతాయన్నారు. ప్రకృతి ఎలా కాలానికి తగ్గట్లు మారుతుందో మనుషుల్లో కూడా మంచితనాన్ని తమ వద్ద వుంచుకుని చెడును దూరంగా వుంచాలని సూచించారు. వారితో పాటు ఉజ్జిని పీఠాధీశ్వరులు సిద్దలింగ శివాచార్య స్వాములు కొట్టూరు శివ కుమార్ స్వామి, భక్తాదులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రోడ్డుపక్కన పడి చనిపోయిన వ్యక్తి

బళ్లారిరూరల్, మే 8 : బళ్లారి నగరం ఎంజి సమీపంలో రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. నిత్యం మద్యం మత్తులో వుంటూ తిరుగుతూ వుండే వ్యక్తి మద్యంకు బానిసై మంగళవారం రాత్రి నిద్రించి ఉదయాన్నే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. రోడ్డుపక్కనే షాపులకు సంబంధించిన వారు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయడంతో అతనిని బళ్లారి విమ్స్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గాంధీ నగర్ పోలీసులు అక్కడకు చేరుకుని మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకున్నారు.

తుకారామ్‌కు భారీ మెజార్టీ ఖాయం

కంప్లి, మే 8 : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఈ తుకారామ్ భారీ మెజార్టీతో గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు దరోజీ జనార్దన్ తెలిపారు. బుధవారం దరోజీలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి శ్రీరాములు కన్నా తమ నాయకుడు ఈ తుకారామ్ లక్ష మెజార్టీతో గెలుపొందుతాడన్నారు. కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని, తమ నాయకుడు నాలుగు విడతల్లో ఎమ్మెల్యేగా వున్న సమయంలో క్షేత్రాన్నిఎలా అభివృద్ధి చేశారో అలాగే ఉభయ జిల్లాలను కూడా అభివృద్ధి చేస్తాడన్నారు.

ఎవరి ధీమా వారిదే!



- పెరిగిన మహిళల ఓటింగ్
- డబ్బు ప్రభావం లేకపోయినా పోటెత్తిన ఓటర్లు
- గ్యారెంటీ పథకాలను నమ్ముకున్న కాంగ్రెస్



బళ్లారి, మే 8(ఆంధ్రజ్యోతి) గాంధీనగర్

బళ్లారి జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో .. ఎన్నికల ఫలితాలపై అభ్యర్థులు అంచనాల్లో తలమునకలైపోయారు. ఎవరికి వారే తమకు అనుకూలంగా అంచనాలు వేసుకుంటున్నారు. ఈ సారి గెలుపు మాదంటే... మాదని ఆశలు నింపుకుంటున్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం, బీజేపీ అభ్యర్థి శ్రీరాములు మధ్యనే ప్రధాన పోటీ కనిపించింది. అందుచేత ఇద్దరిలో ఎవరిని విజయం వరిస్తుందో... ఎవరిని ఓటమి బాధిస్తుందో తెలియక రాజకీయ విశ్లేషకులు తర్జన భర్జనల్లో మునిగిపోయారు. గతంలో కంటే ఈసారి లోక్‌సభ ఎన్నికలు చాలా వినూత్నంగా జరిగాయి. ఓటర్లు డబ్బులకు ప్రభావితం కాలేదు.

ఇరు పార్టీల నాయకులు, బూత్ స్థాయిలో అంకెలను తెప్పించుకుని గెలుపుపై లెక్కలు కడుతున్నారు. బళ్ళారిలో కాంగ్రెస్‌కు మద్దతుగా జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనగా, బీజేపీ తరపున ప్రధాని నరేంద్ర మోది ప్రచారంలో పాల్గొనడం విశేషం. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ తమ అభ్యర్థి తుకారాంకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విషయం పాఠకులకు విదితమే. ఇక మాజీ సీఎం బి.ఎస్ యడ్యూరప్ప, హెచ్‌డి. కుమారస్వామి, బీజేపీ తరపున ప్రచారం చేశారు. మంగళవారం జరిగిన ఎన్నికలో ప్రతి పోలింగ్ బూత్ వద్ద పురుషుల కంటే మహిళలే ఎక్కువ సంఖ్యలో కనిపించారు. అయితే మహిళా ఓట్లు... ఎవరికి లాభం... ఎవరికి నష్టం అన్న విషయమై నాయకులు తర్జన భర్జన చేస్తున్నారు. సిద్దరామయ్య ప్రభుత్వ గ్యారెంటీ పథకాల వలన మహిళలు ఎక్కువగా లబ్దిపొందుతున్నారు కాబట్టి వారి ఓట్లు ఎక్కువ ప్రమాణంలో కాంగ్రెస్‌కు పడ్డాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఇది బీజేపీకి మింగుడు పడడం లేదు. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకుల మొహాల్లో దరహాసం కనిపిస్తోంది.

కంప్లి, బళ్లారి నగరం, బళ్లారి గ్రామీణం, సండూరు, కూడ్లిగి, విజయనగర, హడగలి, హగరిబొమ్మనహళ్లి ఇలా మొత్తం 8 అసెంబ్లీ స్థానాల్లో పోల్ అయిన ఓట్లను బట్టి రాజకీయ పార్టీలు తమ విజయాన్ని అంచనా వేస్తున్నాయి. బీజేపీ అభ్యర్థి బి. శ్రీరాములు తాను ఖచ్చితంగా గెలుస్తానని, తనకు కంప్లి, కూడ్లిగి, విజయనగర, బళ్లారి సిటీ, గ్రామీణం, ఓటర్లు అనుకూలంగా ఓటేశారని లెక్కలు వేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు కూడా కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం గెలుపు తథ్యం అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా దాదాపు ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఉన్న ఈ పార్లమెంటరీ నియోజకవర్గంలో ఇద్దరు మంత్రులు కూడా ఉన్నారు. ఇలా ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు.



ఓటింగ్‌లో మహిళలతో ఫుల్‌గా కన్పించిన లైన్లు(ఫైల్)

కంప్లిలో అత్యధికం.. సిటీలో అత్యల్పం

బళ్లారి గాంధీనగర్, మే 8: బళ్ళారి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే బళ్ళారి, విజయనగరం జిల్లాలలోని 8 తాలూకాల్లో జరిగిన ఓటింగ్‌కు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారులు బుధవారం వివరాలు వెల్లడించారు. బళ్ళారి జిల్లా పరిధిలోకి వచ్చే కంప్లి నియోజకవర్గంలో 78.94శాతం అత్యధికంగా ఓటింగ్ నమోదు కాగా, బళ్ళారి నగరంలో 65.14 శాతం ఓటింగ్ నమోదు కావడం గమనార్హం. కంప్లి నియోజకవర్గం పరిధిలో 2,23,993 మంది ఓటర్లు ఉండగా, 1,76,812 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. బళ్లారి నగరంలో 2,72,673మంది ఓటర్లు ఉండగా, 1,77,621 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

బళ్ళారిలో 2,50,112 మంది ఓటర్లకు గాను 1,80,302 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక సండూరు నియోజకవర్గం పరిధిలో 2,32,400 మంది ఓటర్లు ఉండగా, 1,74,681మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

73.59శాతం ఓటింగ్ నమోదు

విజయనగర జిల్లా పరిధిలోని హడగలి, హగరిబొమ్మన హళ్ళి, విజయనగర, కూడ్లిగి నియోజకవర్గాల్లో అత్యధికంగా హగరిబొమ్మనహల్లిలో 77.96శాతం ఓటింగ్ నమోదు కాగా, విజయనగర జిల్లా కేంద్రమైన హొసపేటలో 70.38శాతం ఓటింగ్ నమోదయింది. హగరిబొమ్మనహళ్ళిలో 2,37,811 మంది ఓటర్లకు గాను 1,85,395మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా విజయనగర జిల్లా హొసపేట నగరంలో 2,60,197మంది ఓటర్లకు గాను 1,83,130మంది ఓటు వేశారు. మిగిలిన వాటిలో హడగలిలో 1,96,858 ఓటర్లకు గాను 1,74,681 మంది ఓటు వేశారు. కూడ్లిగి నియోజకవర్గం పరిధిలో 2,09,996 మంది ఓటర్లు ఉండగా, 1,60,923మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు.

జొన్నల కొనుగోలులో నిర్లక్ష్యం



కిలోమీటర్ల పొడవునా నిలబడిన జొన్నల ట్రాక్టర్లు

అధికారులు, రైతుల మధ్య వాగ్వాదం


సిరుగుప్ప, మే 8 : రోజుకు ఐదు ట్రాక్టర్ల లోడు జొన్నలు కూడా కొనుగోలు చేయకుండా అధికారులు నిర్లక్ష్య ధోరణి వహిస్తుండటంతో రైతులు బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. మూడు కిలోమీటర్ల పొడవునా లోడు ట్రాక్టర్లు ప్రధాన రహదారిలో నిలిపివేశారు. 15 రోజుల నుంచి రోజుకు కేవలం ఐదు ట్రాక్టర్లు మాత్రం అన్‌లోడ్ చేస్తున్నారన్నారు. దీంతో రైతులు ఇంకా ఎన్ని రోజులు ఇక్కడే వుండాలని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. సంబంధిత అధికారులు కొప్పళ్ వెళ్లిన కారణంగా రైతులు ఏమి చేయాలో తెలియక వెనుదిరిగి వెళ్లిపోయారు.

గుండుమల్లెకు ఎండ దెబ్బ / దిగుబడి తగ్గిన పూలు

బళ్లారి గాంధీనగర్, మే 8: పెరిగిన వేసవి వేడిమి హూవినహడగలి తాలూకా పరిధిలో మల్లె సాగుపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. దీంతో మల్లెసాగు రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. విజయనగర జిల్లా పరిధిలో మల్లెపూల సాగు ఎక్కువగా ఉండడంతో ఆ ప్రాంతాన్ని హూవిన(పూలు)హడగలిగా పిలుస్తున్నారు. వేసవి కాలంలోనే మల్లెపూలకు మంచి డిమాండ్ ఉంటుంది. మల్లెపూల సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా... డిమాండ్‌కు తగ్గటుగా మల్లె ఉత్పాదన లేకపోవడంతో మార్కెట్‌లో పూలకు ధర బాగా పెరిగింది. కిలో పూలు రూ.400 పలుకుతున్నాయి. ఆశించిన ధర ఉన్నా... ఈ ఏడాది విపరీతమైన వేడి కారణంగా మల్లెపూల దిగుబడి అనుకున్నంతగా రావడం లేదని ఈ ప్రాంతం రైతులు అంటున్నారు. మల్లెసాగులో ప్రధానంగా పూలచెట్ల బుడం ఎపుడూ చల్లగా ఉండాలి. అయితే మల్లెసాగుకు అవసరమైన నీరు లేకుండా పోవడంతో ఈ ఏడాది వేసవి వేడి... పూల సాగుపై ప్రతికూల ప్రభావాన్ని చూపిందనడంలో సందేహం లేదు. స్థానిక మల్లె రైతుల కథనం ప్రకారం రుతువు ప్రారంభంలోనే ఎకరాకు 20 నుండి 30 కిలోల దిగుబడి వస్తుందని, ప్రస్తుతం వేడితీవ్రత కారణంగా దిగుబడి 10నుండి 15 కిలోలకు పడిపోయినట్టు తెలుస్తోంది. మార్కెట్‌లో మంచి రేటు ఉన్నా అనుకున్న స్థాయిలో చెట్లకు మల్లెమొగ్గలు రావడం లేదని మల్లె రైతులు అభిప్రాయ పడుతున్నారు.



ఉద్యానవన పంటగా గుండుమల్లె..



స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఓటింగ్ యంత్రాలు

అభ్యర్థుల జాతకాలు బ్యాలెట్ బాక్సుల్లో..

- ఆర్‌వైఎంసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలు
- జిల్లాలో 73.92శాతం పోలింగ్ నమోదు
- ఫలితాల కోసం 28రోజుల పాటు వేచి చూడాల్సిందే..
- జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, మే 8: బళ్లారి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మంగళవారం ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగడంతో అందరూ తేలిగ్గా ఊపిరిపీల్చుకున్నారు. అభ్యర్థుల భవితవ్యాన్ని భద్రపరిచిన ఓటింగ్ యంత్రాలను బళ్లారి నగరంలోని రావ్ బహద్దూర్ వై మహాబలేశ్వరప్ప తాంత్రిక మహావిద్యాలయం(ఆర్‌వైఎంసీ) భవనంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్‌వైఎంసీ కళాశాల భవనంలో జిల్లా కలెక్టర్, సాధారణ ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థులు, అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ డోర్ లాక్ చేసి మందపాటి ప్లాంక్‌తో సీల్ చేశారు.

నగరంలోని ఆర్‌వైఎంసీ కళాశాల భవన ఆవరణలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా మీడియాతో మాట్లాడుతూ, బళ్లారి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికలు సాఫీగా, శాంతియుతంగా జరిగాయన్నారు. ఈసారి 73.92 శాతం ఓటింగ్ నమోదైందన్నారు. కంప్లి, బళ్లారినగర్, సండూర్, హడగలి, హగరిబొమ్మనహళ్ళి, విజయనగరం, కూడ్లిగి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉపయోగించిన ఈవీఎం, వీవీ ప్యాట్ ఓటింగ్ యంత్రాలను కళాశాల భవనంలో డీమాస్టర్ చేశామన్నారు. కళాశాల భవనంలో ఓటింగ్ యంత్రాలను ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతోపాటు గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్‌లలో స్ట్రాంగ్ రూమ్‌లు నిర్మించి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల పరిశీలకుడు చంద్రశేఖర్ శాఖమూరితో పాటు అభ్యర్థులు వారి అధికార ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్ వేశారన్నారు. భవనంలో ఓటింగ్ మిషన్లు ఉంచేందుకు మొత్తం 20స్ట్రాంగ్ రూమ్‌లు, పోస్టల్ బ్యాలెట్లు ఉంచేందుకు 2స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూన్ 4వ తేదిన ఇదే భవనంలో ఓట్ల లెక్కింపు జరుగుతుందని, ఇందుకోసం 8కౌంటింగ్ గదులను క్రమపద్దతిలో సిద్ధం చేసినట్లు తెలిపారు. ఒక్కో కౌంటింగ్ రూమ్‌లో 14టేబుళ్ళను ఏర్పాటు చేసి పోలింగ్ బూత్‌ల సంఖ్యను బట్టి కౌంటింగ్ రౌండ్‌లను నిర్ణయిస్తామన్నారు. జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్‌కు సహకరించిన వారందరికీ అభినందనలు తెలిపారు.

ఓటింగ్ యంత్రాలకు గట్టి పోలీస్ భద్రత

జిల్లాలో దాదాపు ప్రశాంతంగా ఓటింగ్ జరిగిందని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ బండారు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీఆర్‌పీఎఫ్, కేఎస్‌ఆర్‌పీ, కేఎస్‌ఆర్‌పీఎఫ్, సివిల్ పోలీస్, డీవైఎస్పీ, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను మోహరించారు. భవనానికి 24గంటలు షిఫ్టుల వారీగా అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారన్నారు. ఈసందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకుడు చంద్రశేఖర్ శాఖ మూరి, అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరా, అదనపు పోలీస్ సూపరింటెండెంట్లు నవీన్ కుమార్, రవి కుమార్ సహా వివిధ అధికారులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేస్తున్న అధికారులు

నిత్యం ట్రాఫిక్‌తో ఇబ్బందులు

బళ్లారి రూరల్, మే 8: బళ్లారి నగరంలో బెంగళూరు రోడ్డు హైవే రహదారిలో గుగ్గిరట్టి, హోస్పేట రైల్వే ట్రాక్ సమీపంలో ప్రతి నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. ట్రైన్ వచ్చిన సమయంలో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కావున అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌పై ఫ్లైఓవర్ నిర్మించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



హైవేపై నిలిచిపోయిన వాహనాలు

హోసూరు జోన్

వేసవిలో అప్రమత్తత అవసరం



సమీక్షా సమావేశంలో కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి), మే 8: వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు కనీస జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని పరిస్థితులపై బుధవారం ప్రత్యేక సమీక్ష చేశారు. కృష్ణగిరి జిల్లాలోని గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించాలని, తాగునీటిని సరైన క్లోరినేషన్ చేసిన తర్వాతే సరఫరా చేయాలని సూచించారు. వర్షాకాలానికి ముందే నీటిని ఆదా చేసేలా ఇళ్లు, సంస్థల్లో సంప్‌లు, రెయిన్ వాటర్ హార్వేస్టింగ్ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. లో ఓల్టేజీ ఉన్న ప్రాంతాల్లో పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. మరోవైపు ప్రాజెక్టు ద్వారా రోజూ 75.45 ఎంఎల్‌డీ తగ్గకుండా నీటిని సరఫరా చేయాలన్నారు. తమిళనాడు ఉమ్మడి తాగునీటి పథకం క్రింద 21 పథకాల ద్వారా నిరంతరాయంగా తాగునీరు అందించాలన్నారు. పురోగతిలో ఉన్న 1350 తాగునీటి పనుల్లో ఎఫ్‌హెచ్‌టీసీ పనులే కాకుండా ఇతర పనులకు ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ఎండలు అధికంగా ఉండడంతో ప్రత్యేకించి మధ్యాహ్నం వేళ విద్యార్థులు, చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు అనవసరంగా సంచరించరాదన్నారు. నీరు తగినంత అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. విపరీతమైన దాహం, తలనొప్పి, శరీరం అలసట, తల తిరగడం, కండరాలు పట్టేయడం, మూర్ఛపోవడం, మూర్ఛలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే నీడకు వెళ్లాలని అవసరమైతే వైద్యుడిని సంప్రదించాలన్నారు. నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, మజ్జిగ, పానకం, గంజి వంటివి తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి సాదనకురళ్, హోసూరు కార్పొరేషన్ కమీషనర్ స్నేహా పాల్గొన్నారు.

టూరిజం హౌస్‌ని సందర్శించిన కర్ణాటక గవర్నర్

హోసూరు, మే 8: బెంగళూరు నుంచి వేలూరుకు రోడ్డు మార్గంలో వెళ్తుండగా కృష్ణగిరి పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ టూరిజం హౌస్‌ని కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌ను బుధవారం సందర్శించారు. కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కెఎం సరయు గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా స్వాగతం పలికారు.



గవర్నర్‌ను స్వాగతిస్తున్న కలెక్టర్

ఈదురుగాలులతో గ్రీన్‌హౌస్‌లకు నష్టం

హోసూరు, మే 8: హోసూరు చుట్టుపక్కల ప్రాంతాల్లోని నర్సరీలు, గ్రీన్‌హౌస్‌లు ఈదురుగాలులతో కూడిన వర్షాలకు దెబ్బతిన్నాయి. కొన్ని వారాలుగా ఎండ వేడిమితో విలవిలాడిన ప్రజలు వర్షం కారణంగా ఊరట చెందారు. అయితే ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పూలు పండిస్తున్న గ్రీన్‌హౌస్‌లు దెబ్బతిన్నాయి. ఇక్కడ గులాబీలు, జర్బెరా, కూరగాయలు, పచ్చిమిర్చి తదితర కూరగాయలు పండిస్తున్నారు. బాగలూరు, బేరికై, తొరపల్లి, అత్తిముగం తదితర ప్రాంతాల్లోని గ్రీన్‌హౌస్‌లు దెబ్బతిన్నాయి



గ్రీన్‌హౌస్ పైకప్పు దెబ్బతిన్న దృశ్యం

రాయచూరులో 64 శాతం ఓటింగ్

- ఎస్ఆర్‌పీఎస్ పీయూ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎంలు



ఈవీఎంలను స్ట్రాంగ్ రూంకు తరలిస్తున్న సిబ్బంది

రాయచూరు, మే 8: రాయచూరు లోక్‌సభ 2024 ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 64.10 శాతం ఓటింగ్ నమోదైనట్లు జిల్లా ఎన్నికల అధికారి చంద్రశేఖర్ నాయక్ ప్రకటించారు. మంగళవారం జరిగిన ఎన్నికల అనంతరం రాయచూరు నగరం, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఈవీఎంలను రాత్రికి రాత్రి నగరంలోని ఎస్ఆర్‌పీఎస్ పీయూ కళాశాలలో భద్రపరిచారు. జిల్లా పరిధిలోని మిగిలిన సురపుర(శోరాపూర్), శాహపూర్, యాదగిరి, రాయచూరు, మాన్వి, దేవదుర్గ, లింగసుగురు, రాయచూరు గ్రామీణ ప్రాంతాలకు చెందిన యంత్రాలను అత్యంత కట్టుదిట్టమైన భద్రతల నడుమ ఎస్ఆర్‌పీఎస్ పీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి చంద్రశేఖర్ నాయక్ సమ్ముఖంలో స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద కేంద్ర బలగాలతో పాటు స్థానిక పోలీసుల బందోబస్తును ఏర్పాటు చేశారు. వచ్చేనెల జూన్ 4వ తేదీ మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపు రోజున స్ట్రాంగ్ రూములు తెరుచుకోకున్నాయి.

రాయచూరు లోక్‌సభ 2024 ఎన్నికల్లో 2010103 మంది ఓటర్లుకు గాను 1299806 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోగా 64.10 శాతం నమోదు అయినట్లు జిల్లా ఎన్నికల అధికారి చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. ఇందులో 994646 మంది పురుష ఓటర్లకు గాను 657267 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1015158 మంది మహిళా ఓటర్లకు గాను 641917 మంది ఓటు హక్కు వినియోగించోగా, ఇతరులు 22 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 1299806 మంది ఓటు వేయగా 64.66 శాతం పోలింగ్ నమోదు అయిందని తెలిపారు.

అతి ఎక్కువగా శోరాపురలో 76.04శాతం ఓటింగ్ నమోదుకాగా, అతి తక్కువగా యాదగిరిలో 60.70శాతం పోలింగ్ నమోదయింది.



నేడు ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాలు



బెంగళూరు, మే 8(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షా ఫలితాలు గురువారం ప్రకటించనున్నారు. మార్చి 25 నుంచి ఏప్రిల్ 4వరకు పరీక్షలు జరిగాయి. మౌల్యమాపన ప్రక్రియ ముగియడంతో గురువారం ఉదయం 10.30గంటలకు ఫలితాలు వెల్లడించేలా కర్ణాటక పాఠశాల పరీక్షా మండలి నిర్ణయించింది. ఫలితాలను వెబ్‌సైట్‌లోనూ వీక్షించే అవకాశం కల్పించారు.

లెక్క తేలాలి..!

● ముగిసిన ఓట్ల పండగ ● పెరిగిన పోలింగ్ .. ● గెలుపోటములపై నేతల తర్జన భర్జన

బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండు విడతల ఓట్ల పండుగ ముగిసింది. ఇక గెలుపోటములపై లెక్కలు ప్రారంభమయ్యాయి. దేశమంతటా కర్ణాటకవైపే చూసేలా లోక్‌సభ ఎన్నికల వేళ పలు సంఘటనలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రంలో 28 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా తొలి విడతలో 14 స్థానాలకు ఏప్రిల్ 26న పోలింగ్ ముగిసింది. మలివిడతలో కరావళి, ఉత్తరకర్ణాటక, మలెనాడు, కల్యాణ కర్ణాటక ప్రాంతాల్లో 14 స్థానాలకు మంగళవారం పోలింగ్ ముగిసింది. తొలి విడతతో పోలిస్తే కొంతమేర ఉత్సాహంగా పోలింగ్ నమోదైంది. సరాసరి 71.84శాతం పోలింగ్ నమోదయ్యింది. ఎన్నికల వేళ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కరువు పరిహారం ఇవ్వలేదని సుప్రీంకోర్టును ఆశ్రయించడం, వెంటనే విడుదల చేయాలనే ఆదేశాలు వచ్చాయి. అందుకు అనుగుణంగా కేంద్రం 3,454 కోట్లు రూపాయలు పరిహారం విడుదల చేసింది. ఈ అంశం దేశమంతటా చర్చకు కారణమైంది. హుబ్బళ్ళిలో కళాశాల విద్యార్థిని నేహా హిరేమఠను దారుణంగా హత్య చేయడం, ఆ తర్వాత రాజకీయ పరిణామాలు జాతీయస్థాయిలో చర్చకు కారణమయ్యాయి. ఆ తర్వాత హాసన్ జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల పెన్‌డ్రైవ్‌లు జాతీయస్థాయిని దాటి చర్చకు కారణమయ్యాయి. సీఎం సిద్దరామయ్య, ప్రధానమంత్రి నరేంద్రమోదీని టార్గెట్ చేసుకుని నిరంతరంగా విమర్శలు చేస్తూ వచ్చారు. బీజేపీ నుంచి ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డాతోపాటు పలువురు అగ్రనేతలు ప్రచారం చేయగా కాంగ్రెస్ నుంచి రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున ఖర్గే ప్రచారం చేశారు. ఎన్నికలు జరిగిన ప్రాంతాల్లో ఎండల వేడిమి తీవ్రంగా ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళ ఉత్సాహంగా పోలింగ్ సాగగా మధ్యాహ్నం కాస్త తక్కువగా ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం 5 గంటల వరకు 66.05 శాతం పోలింగ్ నమోదయ్యింది. అయితే గతంలో కంటే అధికంగా పోలింగ్ నమోదు కావడం విశేషం. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసినా దేశవ్యాప్తంగా ఎన్నికలు కొనసాగుతున్న తరుణంలో ఎగ్జిట్‌పోల్స్‌కు అవకాశం లేకుండా పోయింది.

మలి విడతలో నమోదయిన పోలింగ్ శాతం
71.84

ధీమాలో కొందరు ..

ఎన్నికలు ముగియడంతో గెలుపోటములపై లెక్కలు వేసుకునే ప్రక్రియలో అభ్యర్థులు నాయకులు నిమగ్నమయ్యారు. బుధవారం పలువురు అభ్యర్థుల నివాసాల వద్ద సందడి సాగింది. ప్రతిచోటా బూత్‌లవారీగా ఓట్లు లెక్కేసుకుని మెజారిటీ ఎంత సాధ్యమవుతుందో అనే కోణంలో లెక్కలు వేస్తున్నారు. కొందరు అభ్యర్థులు గెలుపు తమదేనన్న ధీమా వ్యక్తం చేస్తుండగా కొందరు నిరుత్సాహంగా ఉన్నారు. రెండోవిడత కీలకమైన స్థానాల్లో హుబ్బళ్ళి-ధారవాడ, శివమొగ్గ, బెళగావి, చిక్కోడి, హావేరి, బాగల్కోటె, విజయపుర స్థానాల్లో ఎన్నికలు ఒకవైపే అనేలా మారాయని తెలుస్తోంది. ఫలితాలకోసం మరో 27 రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ నేతలు గెలుపుపై ధీమాగా ఉంటే కూటమి నేతల్లో కొంత గందరగోళం నెలకొంది ఉందని చెప్పవచ్చు.







జిల్లాల వారీగా..

తొలి విడత 14 స్థానాల్లో 69.96 శాతం పోలింగ్ నమోదు కాగా రెండో విడతలో 70.41శాతం నమోదైంది. ఇందులో చిక్కోడి 78.66శాతం, బెళగావి 71.49. బాగల్కోటె 72.66, విజయపుర 66.32, కలబురగి 62.25, రాయచూరు 64.66, బీదర్ 68.47, కొప్పళ 70.99, బళ్ళారి 73.59, హావేరి 77.60, ధారవాడ 74.37, ఉత్తరకన్నడ 76.53, దావణగెరె 76.99 శివమొగ్గ 78.33శాతం పోలింగ్ నమోదైంది. 2014 ఎన్నికల్లో 66.62శాతం, 2019 ఎన్నికల్లో 68.65శాతం పోలింగ్ నమోదు కాగా 2024 ఎన్నికల్లో కొంత పెరిగింది. సురపుర అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో 73శాతం పోలింగ్ జరిగింది.

రిలాక్స్..



● ఎన్నికలు ముగియడంతో విశ్రాంతిలోకి నేతలు ● ఊటీకి బయల్దేరిన సీఎం ● అల్లుడింటికి డీసీఎం డీకే

బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలపాటు క్షణం తీరిక లేకుండా ఎన్నికల్లో ప్రచారంతో అలసిపోయిన అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు, ముఖ్యనేతలు రిలాక్స్ మూడ్‌లోకి వెళ్లారు. రాష్ట్రంలో తొలి విడత పోలింగ్ ఏప్రిల్ 26న ముగిసినా రెండో విడత పోలింగ్ మంగళవారం జరిగింది. తొలి విడత పూర్తి అయిన ఇక్కడి అభ్యర్థులు, ముఖ్యనాయకులంతా రెండో విడత ఎన్నికలకోసం ఉత్తర కర్ణాటకకు తరలివెళ్లారు. 40-45 డిగ్రీల ఉష్ణోగ్రతల్లోనూ ప్రచారం, రోడ్‌షో, బహిరంగసభలతో బిజీగా గడిపారు. పోలింగ్ ముగియడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. సీఎం సిద్దరామయ్య విశ్రాంతి కోసం ఊటీకి వెళ్లారు. ఆయన మూడు రోజులపాటు అక్కడే గడపనున్నారు. ఇక డీసీఎం డీకే శివకుమార్ చిక్కమగళూరులోని అల్లుడి ఇంటికి కుటుంబ సమేతంగా వెళ్లారు. బుధవారం డీసీఎం భార్య, పిల్లలతో కలసి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయల్దేరారు. కొన్ని రోజులు అక్కడే గడపనున్నారు. ఆయన మూడు రోజుల తర్వాత రాష్ట్ర సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మడకశిర నియోజకవర్గంలో ప్రచారం చేయనున్నారు. రాష్ట్రమంతటా ఎన్నికల వేడి తగ్గినా రాసలీలల పెన్‌డ్రైవ్ వివాదం తీవ్ర విమర్శలకు కారణమవుతున్నా సీఎం, డీసీఎంలు విశ్రాంతికి వెళ్లడం చర్చనీయాంశం అవుతోంది. జేడీఎస్ కార్యకర్తలు డీకే శివకుమార్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న తరుణంలో చిక్కమగళూరులో ఆయన బస చేసే అల్లుడి ఇంటి చుట్టూ భారీ బందోబస్తు కల్పించారు. పలువురు మంత్రులు విశ్రాంతికోసం వారికి అనుకూలమైన ప్రాంతాకు వెళ్లగా అభ్యర్థులు వారి కుటుంబ సభ్యులతో ఇతర ప్రాంతాలకు వెళ్లారు. హుబ్బళ్లి బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి ఇంట్లో కుటుంబ సభ్యులతో రిలాక్స్‌గా కనిపించారు.



కుటుంబ సభ్యులతో కేంద్రమంత్రి, హుబ్బళ్ళి అభ్యర్థి ప్రహ్లాద్‌జోషి

నో పార్కింగ్..!



● ఎక్కడ బడితే అక్కడ వాహనాలు ఆపితే ఎత్తేస్తారు ● నగరంలో మళ్లీ రోడ్డెక్కనున్న టోయింగ్ వాహనాలు ● 12 స్టేషన్ల పరిధిలో ప్రయోగాత్మకంగా ప్రారంభం

బెంగళూరు మెట్రో, మే 8: రాజధాని బెంగళూరులో టోయింగ్ వాహనాలు మళ్లీ రోడ్డెక్కనున్నాయి. ఫుట్‌పాత్‌ల పైనా, నో పార్కింగ్ స్థలాల్లో ఆపిన వాహనాలను గతంలో టోయింగ్ వాహనాలతో తరలించేవారు. గతంలో ఒకసారి తలెత్తిన వివాదంతో తాత్కాలికంగా టోయింగ్ వాహనాల విధానాన్ని ఆపేశారు. అయితే రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా బెంగళూరు ట్రాఫిక్ పోలీసు దక్షిణ విభాగం ప్రత్యేకంగా 12 స్టేషన్లలో 65 రోడ్లకుపైగా టోయింగ్‌లను ప్రవేశపెట్టనుంది. ప్రయోగాత్మకంగా రెండు నెలలపాటు అమలు చేసి ప్రజల నుంచి వచ్చే స్పందనకు అనుగుణంగా విస్తరింపజేయనున్నారు. అడుగోడి, మడివాళ, మైకో లే అవుట్, ఎకోస్పేస్ జంక్షన్ నుంచి బెళ్ళందూరు మార్గంలో, హెచ్ఎస్ఆర్ లే అవుట్ 24, 27వ మెయిన్ రోడ్డు, బన్నేరుఘట్ట రోడ్డులో అరికెరె జంక్షన్, ఎలక్ట్రానిక్ సిటీ, బసవనగుడి, జయనగర్‌లోని తిలక్‌నగర్ రోడ్డు,, బనశంకరి, కేఎస్ లే అవుట్, తలఘట్టపుర పరిధిలో టోయింగ్ మిషన్లను అమలు చేయనున్నట్లు ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

పిడుగులకు బలి



● వాతావరణ మార్పులతో ఆందోళన ● పదేళ్లలో 850 మంది మృత్యువాత ● రైతులు, కూలీలే అధికం



పిడుగుపాటుకు కాలిపోతున్న చెట్టు(ఫైల్)

బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పిడుగుల ధాటికి పలువురు మృత్యువాత పడుతున్నారు. ముఖ్యంగా రైతులు, కూలీలే అధికంగా బలవుతున్నారు. వేసవి నుంచి వర్షాకాలం మొదలయ్యిందంటే వడగండ్ల వానలు రావడం సహజం. అయితే ఆ తర్వాత రెండు మూడు నెలలు పిడుగుల ప్రమాదాలు గ్రామీణులను బెంబేలెత్తిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పదేళ్ల కాలంలో పిడుగుల ధాటికి 850మంది మృత్యువాత పడ్డారు. రాష్ట్ర ప్రకృతి వైపరీత్యాల నిర్వహణా మండలి పిడుగుపాట్ల నుంచి సామాన్యులను రక్షించేందుకు కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే ఫోన్ల ద్వారా, పలు సమాచార మాధ్యమా ద్వారా పిడుగుల సమాచారాన్ని తెలిపి అవగాహక కల్పిస్తోంది. రాష్ట్రంలో 2020 నుంచి 2023వరకు 9,80,169 పిడుగులు పడ్డాయి. 2023 జనవరి నుంచి డిసెంబరు వరకు 2,05,025 పిడుగులు పడ్డాయి. 2023 మే 21న అత్యధికంగా 13,209 పిడుగులు పడినట్లు వాతావరన శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. మేఘాల ఒత్తిడి, ఘర్షణల వల్ల వడగండ్లు పడుతుంటాయి. వాతావరణంలో మార్పులు, వేడిమి పెరగడం, నీటి పరీవాహకం తగ్గడం, అటవీ పర్యావరణం విస్తీర్ణం కుంచించుకోవడమే పిడుగులు పడేందుకు కారణంగా తెలుస్తోంది. పిడుగుల ధాటికి గురైనవారిలో మహిళలకంటే పురుషులే అధికంగా ఉన్నారు. వ్యవసాయం, ఉద్యానపంటల సాగులో నిమగ్న రైతులు, పశువుల కాపరులు, మత్స్యకారులు పిడుగుల దాటికి బలవుతుంటారు. వర్షాకాలానికి ముందు, ఆరంభంలో ఏప్రిల్, మే నెలల్లో పిడుగులు ధాటి 95శాతం దాకా ఉండగా ఆ తర్వాత కురిసే వర్షాలకు 5శాతం మాత్రమే ఉంటుందని తెలుస్తోంది.

2014 నుంచి 2023 దాకా పిడుగుపాటుకు రాష్ట్ర వ్యాప్తంగా మృత్యువాత పడిన వారి సంఖ్య

2014 - 69
2015 - 70
2016 - 63
2017 - 87
2018 -107
2019 - 105
2020 - 75
2021 - 95
2022 - 113
2023 - 66

అవగాహన కల్పిస్తున్న అధికారులు




పిడుగుల వలన కలిగే ప్రమాదాలపై విద్యార్థి దశ నుంచే పాఠ్యాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలకు పిడుగుల గురించి ముందు జాగ్రత్తలు సూచించేందుకు వరుణమిత్ర సహాయవాణి పనిచేస్తోంది. పిడుగులు, ఉరుములు మొబైల్ సాంకేతికత ద్వారా పరిశీలించుకుంటే రెండు మూడుగంటల ముందు సమాచారం అందించనుంది. ఈ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య ప్రజలకు చేరవేసేలా వరుణమిత్ర కృషి చేస్తోంది. ఇటీవల వాతావరణంలో ఏ మార్పులు చోటు చేసుకున్నా తక్షణమే సెల్ ఫోన్లకు సమాచారాన్ని చేరవేస్తూ విపత్తు నిర్వహణ అధికారుల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

పిడుగులు వచ్చే సూచనలు ఉంటే కనీస జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. ఇళ్ల సమీపంలో ఎండినగడ్డి, చెట్లను తొలగించాలి. బయట ప్రాంతాల్లో సంచరించక వాయిదా వేసుకోవడం, సురక్షితమైన కట్టడాలు, షెల్టర్‌లలో సేద తీరడం, వాహనాలను నడపకపోవడం, విద్యుత్ వాడకాన్ని నిలిపివేయడం, మొబైల్‌లు స్విచ్చాఫ్ చేయడం, విద్యుత్ పరికరాలను నిలిపివేయాలి. వంట గ్యాస్‌ను ఆపేయడం, స్నానం, పాత్రలు తోమడం, షవర్‌లు కొంతసేపు ఉపయోగించకపోవడం, ఎత్తైన భవనాలలో వరండాలో నిద్రించకపోవడం, చెట్ల కింద సేద తీరకపోవడం, ఎత్తైన కొండలు, సముద్రం లోపల, బహిరంగ మైదానాలు, తీరంలో సురక్షిత ప్రాంతాలకు చేరుకోవడం, బోట్‌ల షికారు చేయకపోవడం, పాడుబడిన భవనాలను ఆశ్రయించకపోవడం, లోహపు వస్తువులను తాకకుండా ఉండడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. బెళగావిలో అత్యధిక పిడుగుపాటుకు ప్రధాన కారణం జిల్లా వ్యాప్తంగా చెరుకు సాగు చేయడం, అటవీప్రాంతం, కొండగుట్టలు ఉండడం, వ్యవసాయ భూముల్లో సరైన బస చేసే సౌలభ్యాలు లేకపోవడం వంటివి కారణాలుగా తెలుస్తోంది.

జిల్లాల వారీగా మృతుల సంఖ్య

పలు మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా హఠాత్తుగా వచ్చే పిడుగులు ప్రజల ప్రాణాలను బలిగొంటూనే ఉన్నాయి. జిల్లాలవారీగా పదేళ్లలో మృతుల సంఖ్య ఇలా ఉంది. బెళగావి - 86, కలబురగి 80, విజయపుర 79, బీదర్ 75, హాసన్ 56, కొప్పళ 49, హావేరి 43, యాదగిరి 42, తుమకూరు 40, గదగ్ 37, రాయచూరు 35, బాగల్కోటె 34, బళ్ళారి 33, చిత్రదుర్గ 32, దావణగెరె 32, శివమొగ్గ 28, ధారవాడ 27, మండ్య 18, మైసూరు 16, దక్షిణకన్నడ 15, ఉడుపి 15, చిక్కబళ్ళాపుర 14, చిక్కమగళూరు 14, విజయనగర 14, ఉత్తరకన్నడ 7, చామరాజనగర 6, కొడగు 6, బెంగళూర గ్రామీణ 5, బెంగళూరు నగర 4, కోలారు 3, రామనగర 1గా ఉన్నాయి.



కంటతడితో పరప్పన జైలుకు రేవణ్ణ



బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): కిడ్నాప్ కేసులో అరెస్టు అయిన జేడీఎస్ ఎమ్మెల్యే రేవణ్ణను నాలుగురోజుల సిట్ విచారణ గడువు ముగియడంతో జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. బుధవారం సిట్ అధికారులు రేవణ్ణను 17వ ఏసీఎంఎం కోర్టు ముందు హాజరు పరరగా ఈనెల 14వరకు రిమాండ్ విధించారు. దీంతో రేవణ్ణను పోలీసులు పరప్పన అగ్రహార జైలుకు తీసుకెళ్లారు. అక్కడ వాహనం నుంచి దిగుతూ కంటతడిపెట్టితోనే రేవణ్ణ జైల్లోకి వెళ్లారు. మరోవైపు రేవణ్ణ బెయిల్ పిటిషన్ గురువారం విచారణకు రానుంది. రేవణ్ణ అరెస్టు, జ్యుడీషియల్ కస్టడీపై ఆయన తమ్ముడు, మాజీ సీఎం కుమారస్వామి బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. తాను రేవణ్ణ విషయంలో మాత్రమే పోరాటం చేస్తానని, ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించి అంశాలతో సంబంధం లేదన్నారు. ప్రజ్వల్ ఎక్కడ ఉన్నారో తనకు తెలియదన్నారు. జేడీఎస్ పక్షనేతగా రేవణ్ణ కోసం పోరాటం చేస్తానన్నారు.

టీకా వేసిన గంట లోపే చిన్నారి మృతి



బంగారపేట, మే 8: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో టీకా వేయించుకుని ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే చిన్నారి మృతి చెందింది. తాలూకాలోని దొడ్డవలగమాదికి చెందిన మురళి కుమార్తెకు 9 నెలలు. నిబంధనల ప్రకారం తొమ్మిది నెలల్లో వేయించాల్సిన టీకాను బుధవారం మధ్యాహ్నం వేయించారు. తల్లిదండ్రులు 12 గంటలకు టీకా వేయించి ఇంటికి తీసుకువెళ్లారు. ఒంటి గంటకు నిద్రించిన చిన్నారి తిరిగి లేవలేదు. కంగారుపడిన తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై బంగారపేట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. విచారణలో వివరాలు తెలియాల్సి ఉంది.

అవిముక్తేశ్వర ఆలయ కమిటీలో మైనార్టీ వ్యక్తికి చోటు

● కాంగ్రెస్‌పై మండిపడ్డ బీజేపీ నాయకులు ● తిప్పికొట్టిన సీఎం..

బెంగళూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): హొస్కోటెలోని అవిముక్తేశ్వర బ్రహ్మరథోత్సవ ఆలయ కమిటీలో ముస్లిం వ్యక్తిని సభ్యుడిగా నియమించడంపై రాష్ట్ర బీజేపీ 'ఎక్స్' ద్వారా మండిపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాలను తన స్వాధీనంలోకి తెచ్చుకోవాలని ప్రయత్నిస్తోందని తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. ఈనెల 6వ తేదీ హొస్కోటె తాలూకా తహశీల్దార్ కార్యాలయం విడుదల చేసిన అవిముక్తేశ్వర ఆలయ రథోత్సవ కమిటీలో 8వ సభ్యుడిగా నవాజ్‌ను చేర్చారు. స్థానిక ఎమ్మెల్యే సూచన మేరకు పేరు చేర్చారని మండిపడ్డారు. కాగా సీఎం సిద్దరామయ్య బీజేపీ తీరును మండిపడ్డారు. 2020, 2022 సంవత్సరాల్లో బీజేపీ ప్రభుత్వమే ఉందని అప్పట్లో ఇద్దరు ముస్లింలను నియమించడాన్ని ఏమని అర్థం చేసుకోవాలని తిప్పికొట్టారు. అప్పటి జాబితాలను సీఎం ఎక్స్ ద్వారా పోస్ట్ చేశారు.

